# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ ను పెట్టుబడుల కేంద్రంగా మార్చేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- విశాఖలోని ప్రత్యేక బాలికల సదనంలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై ఎలాంటి అపోహలకు తావు లేదని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
- రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నారు.

==========================

ఆంధ్రప్రదేశ్ ను పెట్టుబడుల కేంద్రంగా మార్చేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. దావోస్ పర్యటన అనంతరం ఈరోజు ఆయన అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. భవిష్యత్ అంతా గ్రీన్ ఇండస్ట్రీ, గ్రీన్ హైడ్రోజన్ తో పాటు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మీదనే ఉంటుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం భవిష్యత్‌లో బాగా ప్రాధాన్యత సంతరించుకుంటుందన్నారు. మొత్తం 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో వివిధ పరిశ్రమలు రాష్ట్రానికి రానున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. అనకాపల్లిలో 1.35 లక్షల కోట్ల రూపాయలతో మిట్టల్ పరిశ్రమ పనులు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. కాకినాడకు గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ రానుందని, అలాగే పలు సంస్థల రాకతో విశాఖ ఐటీ హబ్ గా మారనుందని ముఖ్యమంత్రి వివరిస్తూ…

(వాయిస్ 36 సెకన్లు)

==========================

రాబోయే రోజుల్లో రాజమహేంద్రవరాన్ని క్రీడాపరంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈరోజు రాజమహేంద్రవరంలోని ఎస్వీ గ్రౌండ్ లోని గ్లాడియేటర్ క్రికెట్ క్లబ్

లో లెజెండ్స్ కప్-2025 క్రికెట్ టోర్నమెంట్ పోటీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతిభ ఉన్న క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లభిస్తే అద్భుతంగా రాణిస్తారన్నారు. క్రీడాకారులు శిక్షణ పొందేందుకు అనువైన స్థలం కేటాయించాల్సి ఉందని రాజమహేంద్రవరంలో క్రీడా మైదానం ఏర్పాటు చేసేందుకు అధికారులతో కలసి కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు.

==========================

విశాఖలోని ప్రత్యేక బాలికల సదనంలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై ఎలాంటి అపోహలకు తావు లేదని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆమె ఈరోజు సదనాన్ని సందర్శించి అక్కడి బాలికల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కొంతమంది బాలికలు మానసికంగా ఇబ్బంది పడుతున్నారని.. వారిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. 'పిల్లలను రక్షించే బాధ్యత ప్రభుత్వానిదని, న్యాయస్థానం ఆదేశాలను పాటించడంలో ఎలాంటి రాజీకి తావులేదన్నారు. జరిగిన సంఘటనపై ప్రతిపక్షాలు రాజకీయం చేయడం సబబు కాదని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

==========================

బాలికల హక్కుల పరిరక్షణ, ఎదుగుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని ఈరోజు పార్వతీపురంలో జరిగిన బేటీ బచావో - బేటీ పఢావో కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సాహిస్తే సమాజంతో పాటు, ప్రపంచాన్ని మార్చకలిగే శక్తిమంతులుగా తయారవుతారన్నారు. దేశవ్యాప్తంగా మహిళలు, బాలికల కోసం ప్రత్యేకంగా ఒక రోజును కేటాయించడమే సమాజంలో మహిళలకున్న గౌరవాన్ని ప్రతిభింభిస్తుందని తెలిపారు. బాలికల సాధికారతే లక్ష్యంగా "బేటీ బచావో – బేటీ పఢావో" కార్యక్రమం నిర్వహించుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.

==========================

ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో ఈరోజు నిర్వహించిన ప్రజాదర్బార్ లో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వచ్చిన వినతి పత్రాలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాదర్బార్ లో వచ్చే సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

విరామం

==========================

రాష్ట్ర వ్యాప్తంగా 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, పశ్చిమ గోదావరి, బాపట్ల జిల్లాల్లో నిర్వహించిన ఓటర్ దినోత్సవ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు.

దేశ నిర్మాణంలో ఓటు హక్కు అత్యంత ముఖ్యమైనదని విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ చక్రవర్తి తెలిపారు. మనిషి జీవనానికి స్వేచ్ఛ అవసరమని, ప్రజాస్వామ్యం నుండే ఆ స్వేచ్ఛ లభిస్తుందని, అప్పుడే పిల్లలకు ఓటు విలువ తెలుస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాల స్థాయి నుండే దేశం గొప్పదనం గురించి, ప్రజాస్వామ్యం గురించి పిల్లలకు భోధించాలని సూచించారు.

దేశ పటిష్ట ప్రజాస్వామ్య నిర్మాణానికి ఓటు హక్కు ఎంతో కీలకమని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. యువత ఓటు హక్కు నమోదుతో పాటు ఓటు హక్కు లేని వారికి ఓటర్ గా నమోదు చేయడంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

అలాగే ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ఒక ఆయుధమని పశ్చిమ గోదావరి జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతనతో పాటు పౌరుల బాధ్యతలను గుర్తు చేసి స్ఫూర్తి నింపేందుకు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు.

ఓటుతోనే దేశభవిష్యత్ నిర్ణయించబడుతుందని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి అన్నారు. ప్రజలు మెచ్చిన ప్రభుత్వం ఏర్పడాలంటే ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యత, విలువలపై పౌరులు అవగాహన కలిగి ఉండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ ఎం.జె.అభిషేక్ అన్నారు.

===========================

రేపు ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ పరేడ్ కు దేశ వ్యాప్తంగా 10 వేల మంది అతిథులను ఆహ్వానించారు. అందులో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా పుల్లురు గ్రామ సర్పంచ్ గంగిసేని భవ్యశ్రీ ఈ వేడుకకు హాజరుకానున్నట్లు తెలిపారు. గ్రామ పారిశుధ్య నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు తనకు ఈ ఆహ్వానం అందినట్లు భవ్యశ్రీ వెల్లడిస్తూ....

(వాయిస్ 24 సెకన్లు)

===========================

ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారులుగా పలు జిల్లాలకు చెందిన కలెక్టర్లకు అవార్డులు లభించాయి. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఈరోజు విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఈ అవార్డులను అందజేశారు. విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అవార్డు స్వీకరించారు. కలెక్టర్ తో పాటు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, 5వ బెటాలియన్ కమాండెంట్ మలికా గార్గ్ కూడా అవార్డులు అందుకున్నారు. అలాగే 2024 ఓటర్ల జాబితా రూపకల్పనలో, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో అత్యుత్తమ పని తీరు కనబరిచినందుకుగాను శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఎన్నికల అధికారిగాఅవార్డు లభించింది.

===========================
===========================